

# ఇడ్లీ పిండికి పరీక్షలు

''సుశీలా ! ఈ ఇడ్లీ ప్లేటు నాన్న కిచ్చిరా!'' అమ్మ కేకేసింది.

''నాలుగేపెట్టావేం? మళ్లీ ఎలాగూ ఇంకో రెండు తింటారుగా. ఇప్పుడే వేసెయ్యి. నేనిన్నిసార్లు తిరగలేను. నాన్నకి నేనేం దృష్టి కొట్టనులే!

''వాగకుండా పని చెయ్యడం నేర్చుకో! రెండో చెయ్యాడించుకుంటూ వెళ్లక్కర్లేదు. ఓగ్లాసు మంచి నీళ్లు పట్టుకెళ్లు.''



నాలుగిడ్లీలు ఒక్కోటి వెనక్కి తిరిగి నడుస్తున్న వెంకాయమ్మ గారంతున్నాయి. పక్కనే కారప్పొడి పర్వతం నే కాస్త వేరే ఆలోచనలో పడిపోయి అటు ఇటుగా ప్లేటు పట్టుకునేటప్పటికి పర్వతం పగిలి పోయి లావా ప్రవహించడం మొదలెట్టింది.

''అమ్మోయ్! అమ్మోయ్! అమ్మ మ్మ గారి కిందికి లావా వచ్చేస్తోంది. ఇంకో రెండు ఇసిక బస్తాలేసెయ్యి'' అని అరుచుకుంటూ వెనక్కెళ్లాను.

''ఛ! పని చేస్తే పాతిక వట్టం'' అని నన్ను తిడుతూ ఇంకో రెండు చెంచాల కారప్పొడితో ఆ వుపద్రవాన్ని అప్పటి కాపింది. ప్లేటిచ్చి పరిగెత్తుకుంటూ లోపలికొచ్చి మళ్లీ ఇంకో రెండు వేసొచ్చా! పాపం నాన్న ఇలా ఇంకా తింటూనే వున్నారు. అలా బొయ్‌మంటూ జీపొచ్చేసింది పొట్ట పగిలేలా జనాల్నెక్కించుకుని. అమ్మ పరుగు పరుగున వచ్చి కాఫీ పెద్ద గిన్నెలో చంటి పిల్లలకి పాలార బోసినట్లు చేసి ఇస్తే గుటుక్కుమని మింగేసి టోపీ తగిలించుకుని జీపెక్కేశారు.

చూస్తూనే వున్నాగా! ఎంతయినా నాన్నీ మధ్య ఏలూరు నాన్నలా వుండట్లేదు. ఇది వరకులా మెలకువొచ్చేసినా మంచం మీద దొర్లుతూ అమ్మచేత తిట్టించుకోడం, గంటల తరబడి కాపీ కబుర్లు చెప్పడం, తింటూ తింటూ ఇడ్లీ ముక్క ఎవరెదురుగ్గా వుంటే వాళ్లనోట్లో పెట్టడం లాటివేమీ లేవు. బెత్తవుచ్చుకుని ఏ మాస్టారన్నా వెంట పడ్డారేమోనన్నట్లుగా ఒక్కటే పరుగు అస్తమానం. ఇంట్లోపని కూ్కుడా చంద్రావులూ అప్పల సావులూ కనబడరు. ఇక్కడ మా నాన్న శతకోటి లింగాల్లో ఓ బోడిలింగంట. మొన్న వాళ్లిద్దరూ దేనికోసమో పోట్లాడు కుంటుంటే అమ్మ అంత మాటనేసింది పాపం నాన్ననే వినటం లేదనుకుని. అసలు నాన్న ఆఫీసుకెళ్లడం చూస్తాంగానీ రాత్రి ఇంటికి రావడం చూడనే చూడలేం. అంతసేపు ఎవరు మెళకువతో వుండగలరు బాబూ!

ఒక్కోసారి రాత్రిళ్లు కాంక్రీటుంటే మర్నాడే ఇంటికి రావడం. కృష్ణమ్మ తల్లికి వరదొచ్చేవరకూ అలా రాత్రీ పగలు ఇసికలో చెడుగుడాడాల్సిందేట అందరింజినీర్లూ! శనివారం ఆదివారం అని లెక్కెట్టుకుంటే కుదరదు. మరి ప్రాజెక్టు ఎలవెన్సులూరికే ఇస్తారేమిటి? ఇప్పుడా జీపు అందర్నీ కృష్ణ మధ్యలో వదిలేసి మళ్లీ కారియర్ల కోసం పన్నెండుకల్లా వచ్చేస్తుంది కదా! అమ్మ సర్దిన కారియరు చూస్తే ఎవరికయినా నోరూరిపోవాల్సిందే తెల్సా! మనకయితే మామూలు డబ్బాలో నెయ్యి. మరి నాన్నకి మటుక్కు ఏరోజు వెన్నపూస ఆరోజే కరగేస్తుంది. వంటయిపోయాక పెద్ద గరిటలో కాచిన ఆనెయ్యి గిన్ని వేడి వేడి అన్నం గిన్నెంలో గుచ్చుతుంది. కారియరు పై గిన్నెలో రాత్రే పాలు తోడుపెట్టుంచుతుంది. పాలు కాచీ, కా చీ, కాచీ గులాబీరంగులో కొచ్చేవరకూ కాచి అప్పుడు పెడుతుంది తోడు. పప్పు కుంపటి వేరేగా ఓటుంటుందిగా చిన్నగా! దాని మీద వుడకబెడుతుంది మధ్యాహ్నాలు వేయించుంచుకున్న కందిపప్పుని. ఆపప్పులో ఎవరికీ తెలియకుండా బెల్లం నెయ్యి పసుపు ఇలా ఎన్నెన్నోవేస్తుంది. అది ఎవరికీ తెలియకూడదుట. తన సీక్రెటన్నమాట. ఇంక ఇంకో కుంపటి మీద రాచ్చిప్పడు ముక్కలపులుసు. నాన్నకీ రెండూ వుంటే ఇంకేం అక్కర్లేదు. పప్పూ దప్పళంవుంటే కూరెందుకు కుమ్ములోకి అంటార్ట. అయినా చేస్తుందనుకో మేవంతా లేమూ మింగడానికి! ఈ కారియరు కాకుండా వేరే వెండి డబ్బాలో (అమ్మమ్మిచ్చిందిట వాళ్ల పెళ్లిలో) బోల్డు వక్కపొడీ, పదిహేనుచిలకలూ తడి రుమాల్లో చుట్టించి పెట్టిస్తుంది.

జీపు డ్రైవరుకి పదిసార్లు చెప్తుంది జాగర్తా జాగర్తా అని. అందిరికీ అన్నాలు తీసికెళతాడు కదా! మనొక్కళ్లదీ ఎందుకు పారేస్తాడు? అసలు నాకేవనిపిస్తుందంటే కృష్ణన్ మామా మానాన్న కారియర్లో వాటాకొస్తారని అమ్మకనుమానవేమోనని! అక్కడికీ వంకాయకూర పనసకాయ కూర లాటివి చేసినప్పుడు అన్నం పెట్టినంతపెడుతుందనుకో. ఆయన మాత్రం ఏం చేస్తారు

పాపం వాటాకి రాక! మామీ రోజూ గిన్నెలో సాంబారన్నం ఇంకో గిన్నెలో పెరుగన్నం చిన్నపిల్లలకి పెట్టినట్లు కలిపి మరీ పెడుతుంది. ఆమాత్రం ఆయనకి కలుపుకోడం రాదేవిటీ! ఎప్పుడో వేయించి పెట్టిన ఓ రెండప్పడాలు పెడుతుంది. నాన్న కన్నా ఎంత పెద్ద ఇంజనీరయితే మాత్రం ఏంసుఖం. రాత్రిళ్లయితే నీళ్లల్లోంచి అన్నం తీసి తింటారుట. అదే మరి మనమ్మో! నాన్న నీళ్ల పోసుకోడానికి వెళ్లాక అప్పుడు వేయిస్తుందీ బంగాళా దుంపలూ-! ఆహా ఆ రుచి మాటల్లో చెప్పలేం. ఇంకా చిన్నింజనీరుగా మిగిలి పోయానని ఏం బెంగెట్టుకోక్కర్లా!

ఆవేళ దెబ్బలు తింటే తిన్నాగానీ నీళ్లు తోడ్డం మాత్రం మాంఛి టయంపాసుగా అయిపోయింది. బక్కెట్టెక్కక్కర్లేకుండా నీళ్లు తోడే వుపాయం అమ్మే కనిపెట్టి పెట్టిందిగా. ఓ వంకీ కర్రని తీసుకుని నీళ్ల చేదని పైదాకా తోడాక, దానికి వంకీ తగిలించి నెమ్మదిగా వెనక్కి నడుస్తుంటే చేద చేతికంది పోతుందన్న మాట. చిన్నారి వెనకాల తాడు పట్టుకుంటే చాలు. కానీ రోజూ నీళ్లు తోడి పెట్టడానికి మేం ఏవన్నా అందుకే పుట్టావేవిటి? ఏదో పనులన్నీ చెయ్యడం వచ్చుంటే రేపత్తారింటికెళ్లాక ఏ తల్లిపెంచిందీ మిమ్మల్నీ అనడగకుండా వుంటారని చెప్పి గానీ, రోజూ తోడితే చేతులు బొబ్బలెక్కిపోవూ! అన్నీ మేమే చేసుకుంటే ఆ దుర్గికి పది రూపాయల జీతం ఎందుకొప్పుకున్నట్లూ!

ఏ పని చేస్తే చేతులు బొబ్బలెక్కకుండా ఘనంగా కనిపిస్తుందా అని అందరం ఆలోచించగా పప్పు రుబ్బితే బాగుంటుందని తెలిసిపోయింది. ఎవరితోనయినా అమ్మ గొప్పగా కూడా చెప్పుకోవచ్చు ! మా పిల్లలు పప్పు కూడా రుబ్బి పెడతారని !

అమ్మ అన్నం తింటుంటే పీటేసుకుని పక్కనే కూచుని మొదలెట్టాం. ''అమ్మో! కృష్ణమ్మకి వరదలొచ్చే వరకు రోజూ నువ్విడ్లీలు చెయ్యక తప్పదు. ఒక్కదానివి ఇంటెడు చాకిరీ చేసుకుంటున్నావు ! ఆ దుర్గి వుత్త కబుర్లు పోగు ! దేనికీ కలిసి రాదు. మేం గానీ పప్పు రుబ్బి పెడితే ఈ సెలవల్లో ముచ్చెంగా మూడు పన్లు నేర్చుకున్నట్లవుతుందీ. ఆనక నీకూ్కూడా మా అత్తారి దగ్గిర మాట రాదూ'' అని నేనూ చిన్నారీ వచ్చి చెప్పాం.

ఏ కళనుందో మమ్మల్ని చూసి నవ్వి 'మీ మొఖాలకి అత్తారోటి తక్కువయ్యారు ఇప్పట్నించీ. సర్లే రోలు దగ్గిర నీడొచ్చాక చూపిస్తాలే' అంది. ఇంక ఈ లోపల పప్పు పొట్టు తీసుంచుకోవాలి కదా ! అమ్మ అన్నం తింటుండగానే రెండు పెద్ద గిన్నెలూ బోల్డు నీళ్లూ పట్టికెళ్లి కూచున్నాం. అన్నీ తనే చెప్పింది. పెద్ద గిన్నెలో పప్పు నీళ్లు పోసి బాగా పిసికేసి గిరగిరా గిరగిరా తిప్పేసి స్పీడుగా పక్కనున్న పెద్ద గిన్నెలో కొంచేయాలి. అలా చేస్తే ఆ స్పీడు నీళ్లతో బాటు పొట్టు వెళ్లిపోతుంది పప్పుని కిందొదిలేసి. అలా ఓ వెయ్యిసార్లు చెయ్యాలంది గాని నూటేభై సార్లకే పప్పు తెల్లగా వచ్చేసింది. కాపోతే పక్క గిన్నెలోకి పొట్టుతో బాటు కాసిని పప్పుబద్ద ల్లెళ్లిపోయాయి. ముత్యాలల్లే కనిపిస్తున్నాయిగా ! అన్నీ ఏరేసి పప్పు గిన్నెలో వేసేటప్పటికి బోల్డు

సేపు పట్టేంది. ఈ లోపల కాపలాకి పెట్టిన బుజ్జి అరిచింది 'నీడొచ్చింది! నీడొచ్చింది రోలు నల్లగా అయిందని చెప్పి.

అప్పుడు అమ్మ వచ్చి ముందు రోలు శుభ్రంగా కడగండని చెప్పి పాత్రం తీసి పక్కన పెట్టి వెళ్లి పోయింది. మేవందరం కొబ్బరి పీచెట్టి రోలు మెరిసి పోయేలా కడిగాక మళ్లీ వచ్చి పాత్రం రోట్లో పెట్టి పప్పు నీళ్లోడ్చి రోట్లో ఎలా వేస్తారో చూపించింది. నన్నూ చిన్నారినే రుబ్బమంది. ఎవరు పాత్రం తిప్పుతుంటే వాళ్లే పిండి తొయ్యాలిట. ఒకళ్లు రుబ్బుతూ ఒకళ్లు తోస్తే వేళ్లు పచ్చడయిపోతాయట ! నేనో వందసార్లు చిన్నారో వందసార్లు. ఇందేమో లెఖ్ఖ పెట్టడం. అలా గిరా గిరా తిప్పుతుండగానే పప్పులు కనిపించడం మానేసి పాత్రం బరువయిపోయేది. అలాటప్పుడు మళ్లీ నీళ్లు జల్లడం రుబ్బడం. మళ్లీ అమ్మొచ్చింది. ''వచ్చేసిందే ! ఇంకేం ! ఇలాగే రుబ్బుతూ వుండండి పిండంతా దూదిలా తెల్లగా తేలికగా అయేవరకూ కాసిని కాసిని నీళ్లు జల్లుతూ!'' అంది.

''కళ్లున్నాయి కాబట్టి పిండి తెల్లగా అవడం తెలుస్తుంది గానీ, తేలిగ్గా అయిందో లేదో తెలిపేందుకు ఇక్కడేవన్నా తాసూ తక్కెడా అమర్చావా తల్లీ!'' అనడిగా.

''అన్నిటికీ తక్కెడ అక్కర్లేదు. తడి అరచేతిలో కాస్త పిండి తీసుకుని వుఫ్‌మని వూదితే బుజ్జి కూచున్నంత దూరంలో పడాలి. అప్పుడు నలిగినట్లు. ఇంక పాత్రం బరువుండదులే. జాలుగా రుబ్బుతూ వుండండి. నేనీ లోపల బజ్జీలు చేసేస్తా''నని అమ్మ వంటింట్లో కెళ్లి పోయింది.

అమ్మ మెచ్చుకుందిగా. ఇంక మమ్మల్నెవరాపగలరు ! స్పీడు స్పీడుగా రుబ్బేటప్పటికి పాలు పొంగినట్లు రోలంతా పిండే. ఇంక పరీక్ష మొదలు పెట్టాం. వూదడం రుబ్బడం వూదడం రుబ్బడం. బుజ్జి గౌను మీద్దాకా వచ్చేసింది. ఇటు తిరిగితే బుజ్జి కంట్లో పడుతుందేమోనని దాన్ని వెనక్కి తిప్పి కూచోబెట్టాం.

వీధి తలుపు నెంత బాదినా ఎవరూ తలుపు తీయట్లేదని తిన్నగా సావిత్రొదిన సందులోంచి పెరట్లోకొచ్చేసింది. ''అదేవిటే ? బుజ్జిని పాపం గోడకేసి తిప్పి కూచోపెట్టారూ! దాని గౌనునిండా ఆ పిండేవిటీ'' అనుకుంటూ.

''పిండి రుబ్బడం నేర్చుకుంటున్నాం వదినా! దాని కంట్లో పడుతుందేమోనని వెనక్కి తిప్పి కూచోపెటాం. చూడు నలిగినట్లేనా?''

'' ఆచాల్చాలు! మనిడ్లీలు తింటే హోటలు వాడు మూసుకుపోవాల్సిందే! కాపోతే సగం పిండి బుజ్జి గౌను తినేసింది. సరోజమ్మా చూడు! నీ పిల్లలెంత పనిమంతులయ్యారో! కానీ కాస్త రవ్వ తగ్గించుకో'' అంటూ వంటింట్లోకెళ్లింది అమ్మచేస్తున్న బజ్జీలు రుచి చూడ్డానికి!